క్లుప్తంగా

పీఎస్‌ను సందర్శించిన సెంట్రల్ జోన్ డీసీపీ

ఖిలావరంగల్: వరంగల్ రైల్వేగేట్ ప్రాంతం మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం రాత్రి వరంగల్ ఏసీపీ బోనాల కిషన్‌తో కలిసి సెంట్రల్ జోన్ డీసీపీ బారి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. కేసుల రికార్డులు, సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. ఆనంతరం పెండింగ్ కేసుల వివరాలను ఇన్‌స్పెక్టర్ ముస్క శ్రీనివాస్‌ను అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదుదారులపై నిర్లక్ష్యం వ్యవహరించకూడదన్నారు.

డైరీ ఆవిష్కరణ



హన్మకొండ అర్బన్ : తెలంగాణ బంజారా ఎంప్లాయిస్ సేవా సంఘం (టీబీఈఎస్ఎస్) డైరీని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ మంగళవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు రాజన్న, ప్రధాన కార్యదర్శి హట్కర్ సీతారాంనాయక్, కోశాధికారి గణపతినాయక్, వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి హట్కర్ తిరుపతి నాయక్‌లు పాల్గొన్నారు.

సీఎంహెచ్ఓగా రాజేష్

వరంగల్ అర్బన్ : వరంగల్ మహా నగర పాలక సంస్థ చీఫ్ మెడికల్ ఆఫీసర్(సీఎంహెచ్)గా ఎం.రాజేష్‌ను నియమిస్తూ కమిషనర్ ప్రావీణ్య మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటి వరకు సీఎంహెచ్‌వోగా పనిచేసిన జ్ఞానేశ్వర్ పూర్తి స్థాయిలో విధులు నిర్వహించలేకపోతున్నారనే విమర్శలున్నాయి. సీఎంహెచ్ఓ రాజేష్‌కు కాజీపేట సర్కిల్ ఎంహెచ్ఓగా, కాశిబుగ్గ సర్కిల్ ఎంహెచ్ఓగా జ్ఞానేశ్వర్‌కు అంతర్గత బదిలీ చేశారు. రాజేష్ బల్దియా ప్రధాన కార్యాలయంలో మేయర్ గుండు సుధారాణికి పూల మొక్కను అందజేశారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

వరంగల్ అర్బన్ : తెలంగాణ మున్సిపల్ వర్క్‌ర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) టేబుల్ క్యాలెండర్‌ను బల్దియా సీఎంహెచ్‌వో రాజేష్ ఆవిష్కరించారు. మంగళవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో సీఎంహెచ్‌వోను యూనియన్ నాయకులు కలిసి పుష్పగుచ్ఛాన్ని అందచేసి, ఔట్ సోర్సింగ్ కార్మికులు సమస్యలను విన్నవించారు. కార్యక్రమంలో సానిటరీ సూపర్‌వైజర్ మాదాసు సాంబయ్య, యూనియన్ రాష్ట్ర కార్యదర్శి జన్ను ప్రకాశ్, సీఐటీయూ జిల్లా కోశాధికారి సింగారపు బాబు, ప్రతినిధులు, పాల్గొన్నారు.

ఉత్సవాలు ప్రారంభం

హసన్‌పర్తి: శ్రీ సీతా లక్ష్మణ హనుమత్ సమేత శ్రీ రామచంద్రస్వామి ఉత్సవ విగ్రహాల ప్రతిష్ఠాపన ఉత్సవాలు మంగళవారం 66వ డివిజన్ ఆర్టీసీ కాలనీలో ప్రారంభ మయ్యాయి. తొలి రోజు సాయంత్రం 5 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం, 6 గంటలకు విష్వక్సేన ఆరాధన అంకురార్పణ, మృత్యుంగ్రహణము, రక్షాబంధనము, తీర్థప్రసాద గోష్టి కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో జరిగాయి.

రక్షణ కల్పిస్తున్న సఖి సెంటర్


కాజీపేట: పాశ్చాత్య సంస్కృతికి అలవాటు పడి యువతులు, మహిళలపై వేధింపులకు పాల్పడుతున్న వ్యక్తుల నుంచి రక్షణ కల్పించడానికి సఖి సెంటర్ ఎంతో తోడ్పాటు అందిస్తుందని కేస్ వర్కర్ వినీలా అన్నారు. 63వ డివిజన్ విష్ణుపురిలో రక్షిత మంచినీటి పథకం ఓవర్‌హెడ్ ట్యాంక్ ఆవరణలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సును ఆమె ప్రారంభించారు. సమావేశంలో ఏపీఎం వెంకటరెడ్డి, శ్రీనివాస్, శ్రీలత, తిరుపతి రెడ్డి, ఎ.సరిత పాల్గొన్నారు.

దుబాయ్ సదస్సుకు రవీందర్



వరంగల్: దుబాయ్‌లో ఈనెల 25న నార్త్ అ మెరికన్ పద్మశాలి అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగే గ్లోబల్ పద్మశాలి సదస్సుకు వరంగల్ జి ల్లా పద్మశాలి సంఘం అధ్యక్షుడు ఆడెపు రవీందర్ ఎంపికయ్యాడు. ఈ మేరకు ఆయనను దు బాయ్‌కు రావాలని ఆహ్వానం అందింది. పద్మశాలి సంఘం బలోపేతానికి రవీందర్ మరింత కృషి చేయాలని పద్మశాలి సంఘం సభ్యులు కోరారు.

అధునాతన మెషీన్ ఆవిష్కరణ



హసన్‌పర్తి : నగరంలోని కిట్స్ కళాశాలలో డ్రైవ్ లైన్ కట్ సెక్షన్ మోడల్ మెషీన్‌ను ఓల్వో గ్రూప్ వైస్ ప్రెసిడెంట్ జి.వి.రావు ఆవిష్కరించారు. ఓల్వో గ్రూప్ ఈ మెషీన్‌ను కిట్స్ కళాశాలకు బహూకరించింది. ఈ సందర్భంగా జి.వి.రావు మాట్లాడుతూ పోటీతత్వం ఉన్న మెకానికల్ ఇంజనీరింగ్ రంగంలో నిబద్ధత, అంకితభావం కలిగి ఉండాలన్నారు. ప్రస్తుతం మెకానికల్ రంగం ప్రాముఖ్యత గురించి వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన మెకానికల్ విభాగాధిపతి ప్రొఫెసర్ కె.రాజనరేందర్‌రెడ్డి, శ్రీకాంత్, పాల్గొన్నారు.

నేడు కమర్షియల్ షట్టర్ల అద్దెకు వేలం

- దక్కించుకునేందుకు జట్టు కట్టిన వ్యాపారులు
- 18 షట్టర్లకు 28 దరఖాస్తులే కొనుగోలు
- నేడు ఏనుమాములలో వేలం పాటలు



లక్ష్మీపురం మార్కెట్‌లోని కమర్షియల్ కాంప్లెక్స్

వరంగల్: వరంగల్ లక్ష్మీపురంలోని మోడల్ మార్కెట్‌లో నిర్మించిన కమర్షియల్ కాంప్లెక్స్‌లోని 18 షట్టర్లకు బుధవారం ఎనుమాముల మార్కెట్ ప్రధాన కార్యాలయ భవనం హాల్‌లో వేలం నిర్వహించనున్నారు. కాంప్లెక్స్‌లో 30 షట్టర్లు నిర్మించి గత ఏడాది డిసెంబర్‌లో బహిరంగ వేలం నిర్వహించారు. వేలంలో దక్కించుకున్న వారి నుంచి మూడు నెలల అద్దెను డిపాజిట్‌గా తీసుకుని 2022 జనవరిలో అగ్రిమెంటు చేసి అప్పగించారు. అందులో ఇద్దరు, ముగ్గురు మినహా ఎవరూ సరిగా అద్దెలు కట్టకపోవడంతో మూడు నెలల అద్దెలను మినహాయించుకున్నారు. నిబంధనల ప్రకారం మూడు నెలలు వరుసగా అద్దె కట్టకుంటే డిపాజిట్‌ను జప్తు చేసి వెంటనే టెండర్లు నిర్వహిస్తే మార్కెట్ కమిటీకి ఆదాయం లభించేది. అలాకాకుండా ఏడాది వరకు వేచి చూసి ఇప్పుడు వేలం నిర్వహించడంతో పెద్ద మొత్తంలో ఆదాయం కోల్పోయిందన్న వాదనలు వినిపిస్తున్నాయి.

నోటీసులతో వ్యాపారం...

కమర్షియల్ కాంప్లెక్స్‌లో షట్టర్లు పొందిన వ్యాపారులు అద్దెలు కట్టలేమని సామాజికవర్గాన్ని సాకుగా చూపి నాలుగు షాపులకు చెందిన వారు కోర్టు నుంచి నోటీసులు ఇప్పించి హాయిగా వ్యాపారం చేసుకుంటున్నారు. నిబంధనల ప్రకారం షాపుల్లో కూరగాయలు, పండ్లు తప్ప మిగిలిన సరుకులు మాత్రమే అమ్మాల్సి ఉంది. ఈ నిబంధనలను అధికారులు పట్టించుకోకపోవడంతో ఈ వ్యాపారులు ఆడిందే ఆట...పాడిందే పాటగా మారింది. అధికారుల్లో కొంత మంది వీరికి అండగా ఉండి సూచనలు ఇస్తున్నందున ఇలా జరుగుతున్నదని పలువురు అంటున్నారు. బకాయిలు వసూలు చేయకపోవడం వల్లనే ఈ షాపుల జోలికి పోలేదని తెలిసింది. వేలంలో పాడిన మేరకు అద్దెలు కట్టలేమని సరెండర్ చేసిన 18 వ్యాపారులకు సంబంధించిన షట్టర్లకు మాత్రమే 22న టెండర్లు నిర్వహిస్తున్నారు.

దక్కించుకునేందుకు ప్రయత్నాలు...

కాంప్లెక్స్‌లో సరెండర్, కోర్టుకు, బకాయిలు ఉన్న వారు ప్రస్తుతం నిర్వహిస్తున్న షట్టర్లు దక్కించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ప్రస్తుతం నడుస్తున్నాయని చెబుతున్న 8 షట్టర్లకు కిరాయి రూ.18 నుంచి 24వేల వరకు ఉంది. ఈ వేలంలో షట్టర్లకు రూ.4200లు మినిమం పెట్టాలని అధికారులు నిర్ణయించడంతో రూ.5నుంచి 6 వేల వరకు పాడాలని ప్లాన్ చేసుకున్నట్లు తెలిసింది. వారం నుంచి టెండర్ దరఖాస్తు ఫారాలు విక్రయిస్తున్నా గతంలో ఉన్న డిమాండ్ 18 షట్టర్లకు 28 దరఖాస్తులు మాత్రమే అమ్ముడుపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కేసులు వేసిన వారు, బకాయిలు ఉన్నవారు సైతం ఈ వేలంలో పాల్గొని దక్కించుకునేందుకు పావులు కదుపుతున్నారు. ఇలా రెండు మూడుసార్లు వేలం నిర్వహిస్తే మొత్తం 30 షాపులు కేసుల పాలయ్యే అవకాశాలు ఉన్నాయి. అగ్రిమెంటు సమయంలో పకడ్బందీగా నిబంధనలు పెట్టినప్పటికి అధికారులు వాటిని అమలు చేయకపోవడం వల్లే ఈపరిస్థితులు తలెత్తినట్లు చర్చించుకుంటున్నారు. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు దృష్టిపెట్టాలని వ్యాపారులు కోరుతున్నారు.

క్రీడలపై ఆసక్తిని పెంపొందించుకోవాలి

- జిల్లా గ్రంథాలయ చైర్మన్ అజీజ్‌ఖాన్



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్‌ఖాన్

కేయూ క్యాంపస్: యువత క్రీడలపై ఆసక్తిని పెంపొందించుకోవాలని తమ కిష్టమైన క్రీడల్లో రాణించేందుకు కృషి చేయాల జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్‌ఖాన్ కోరారు. బీఆర్ఎస్‌వీ, కాకతీయ క్రికెట్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో ప్రభుత్వ చీఫ్‌విఫ్ దాస్యం వినయ్‌భాస్కర్ నేతృత్వంలో హనుమకొండలోని ఆర్ట్స్‌అండ్ సైన్స్ కళాశాల మైదానంలో సీఎం కేసీఆర్ క్రికెట్ చాంపియన్‌షిప్ పోటీలు కొనసాగుతున్నాయి. మంగళవారం క్రికెట్ పోటీలను అజీజ్‌ఖాన్ పాల్గొని క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. క్రీడలు శారీర దారుఢ్యానికి మానసిక ఉల్లాసానికి దోహదం చేస్తాయన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్‌వీ జిల్లా కోఆర్డినేటర్ బైరపాక ప్రశాంత్, కాకతీయ క్రికెట్ అకాడమీ చైర్మన్ ఫారూఖ్, నాయకులు అస్లాం, వీరు, వీరేందర్, రాకేష్, పరుశరాములు, రాంబాబు, తిరుపతి, నరేంద్ర, పాల్గొన్నారు.

కేయూలో ముగ్గురికి డాక్టరేట్



చిలుసాని రాజు



వెంకటేశ్వర్లు



రామకృష్ణ

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో ఎకనామిక్స్ విభాగంలో చిలుసాని రాజుకు, ఈదునూరి వెంకటేశ్వర్లకు యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రకటించింది. ఇంపాక్ట్ ఆఫ్ గ్లోబలైజేషన్ ఆన్ హ్యాండ్లూమ్ ఇండస్ట్రీ–ఏ స్టడీ అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి రాజుకు డాక్టరేట్‌ను ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య పి.మల్లారెడ్డి తెలిపారు. ఎమర్జింగ్ ట్రెండ్స్ ఇన్ కన్సమ్షన్ ప్యాటర్స్–ఏ స్టడీ ఇన్ రూరల్ ఏరియాస్ అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి వెంకటేశ్వర్లకు డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. వీరు ఎకనామిక్స్ విభాగం రిటైర్డ్ టి.పాపిరెడ్డి పర్యవేక్షణలో డాక్టరేట్‌ను పూర్తిచేశారు.

సోషియాలజీ విభాగంలో రామకృష్ణకు..

కేయూలోని సోషియాలజీ అండ్ సోషల్ వర్క్ విభాగంలో పరిశోధకుడు వల్లాల రామకృష్ణకు యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రకటించింది. గ్రామీణాభివృద్ధిలో స్వయం సహాయక సంఘాల పాత్ర వరంగల్ జిల్లాలో ఒక అధ్యయనం అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి రామకృష్ణకు డాక్టరేట్‌ను ప్రదానం చేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి మల్లారెడ్డి తెలిపారు. ఆ విభాగం ఆచార్యులు కుంట అయిలయ్య పర్యవేక్షణలో రామకృష్ణ తన పీహెచ్‌డి పూర్తిచేశారు.

జర్నలిస్టుల సేవలు గొప్పవి

- ప్రెస్‌క్లబ్ భవన నిర్మాణానికి సాయం చేస్తా
- ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య



ఎమ్మెల్యే రాజయ్యకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ప్రెస్‌క్లబ్ నూతన కమిటీ సభ్యులు

నయీంనగర్ : సమాజంలోని రుగ్మతలను తొలగిస్తూ ప్రజా చైతన్యానికి పాటుపడుతున్న జర్నలిస్టుల సేవలు చాలా గొప్పవని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య అన్నారు. గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్ నూతన కమిటీ అధ్యక్షుడు వేముల నాగరాజు, ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య, కోశాధికారి బోళ్ల అమర్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు ఎమ్మెల్యే రాజయ్యను హన్మకొండలోని అయన కార్యాలయంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్ అభివృద్ధికి తన వంతు కృషి చేయాలని ఎమ్మెల్యేను కోరారు. ఎమ్మెల్యే రాజయ్య మాట్లాడుతూ తన రాజకీయ జీవిత ఎదుగుదలకు జర్నలిస్టుల పాత్ర ముఖ్యమైనదన్నారు. వరంగల్ ప్రెస్‌క్లబ్ ఆవరణలో చేపట్టనున్న నూతన భవన నిర్మాణానికి సహాయం చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్లు, జాయింట్ సెక్రటరీలు, ఈసీ మెంబర్లు పాల్గొన్నారు.

23న జరిగే బంద్‌ను విజయవంతం చేయాలి

వరంగల్: ఈనెల 23న జరిగే రాష్ట్ర బంద్‌ను విజయవంతం చేయాలని తెలంగాణ మార్కెట్ యార్డు అడ్తి అండ్ కమీషన్ ఏజెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కటకం పెంటయ్య పిలుపునిచ్చారు. మంగళవారం హైదరాబాద్‌లో ఈ విషయమై డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ మార్కెటింగ్ లక్ష్మీబాయి స్వయంగా కలిసి సమస్యలను వివరిస్తూ వినతి పత్రం అందజేశారు. ఆయన వెంట చాంబర్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్ రెడ్డి, అడ్తి సెక్షన్ అధ్యక్షుడు ఎన్ రెడ్డి లింగారెడ్డి పాల్గొన్నారు

బొడ్రాయి వార్షికోత్సవం

వరంగల్ చౌరస్తా : వరంగల్‌లోని గిర్మాజీపేట బొడ్రాయి 12వ వార్షికోత్స మహోత్సవం మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా హోమం, అమ్మవారికి పంచామృతాభిషేకం, సామూహిక కంకుమార్చనలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ముగిసిన శివరాత్రి బ్రహ్మోత్సవాలు



నందివాహనంపై అమ్మవార్లను ఊరేగిస్తున్న దృశ్యం

హన్మకొండ కల్చరల్ : హన్మకొండలోని చారిత్రక వేయిస్తంభాల దేవాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు 5వ రోజు మంగళవారం ముగిశాయి. ఆలయ ప్రధానార్చకులు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో వేదపండితులు మణికంఠశర్మ, అర్చకులు ప్రణవ్, మేఘనాథ్‌లు ఉదయం ఉత్థిష్ఠ గణపతికి ఆరాధన, రుద్రేశ్వరునికి ఏకవార రుద్రాభిషేకం, ఆలయప్రాంగణంలోని క్షేత్రపాలకుడైన ప్రసన్నాంజనేయస్వామికి పంచామృతాలతో నవరసాలతో అభిషేకం, చందనపూజ, ఆకుపూజ, వడమాలధారణ, నూతన వస్త్రాలంకరణ, షోడశోపచారపూజ, మహాహారతి, మహామంత్రపుష్పం నిర్వహించారు. యాగశాలలో నిర్వహిస్తున్న గణపతి నవగ్రహ రుద్ర హోమం జయాదిహోమాలు జరిపి మహాపూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఉత్సవ విగ్రహాలను నందివాహనంపై ప్రతిష్ఠించి ఘనంగా గ్రామోత్సవం నిర్వహించారు. దేవాలయం నుంచి రాగన్నదర్వాజ వరకు ఊరేగించారు. ఆఫీసర్స్ క్లబ్ జనరల్ సెక్రటరీ ప్రముఖ ఆధ్యాత్మిక దొంతి రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్నప్రసాదాల వితరణ జరిగింది. కార్యక్రమాలలో రుద్రేశ్వరసేవా సమితి సభ్యులు రావుల సుదర్శన్, పులగంధం రాజారాం సేవలందించారు. ఆలయ ఈఓ శేషగిరి పర్యవేక్షించారు.

మోసం చేయడంలో కేసీఆర్ దిట్ట

బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్



మాట్లాడుతున్న కొండేటి శ్రీధర్

హసన్‌పర్తి : తెలంగాణ వస్తే ఇంటికి ఓ ఉద్యోగం ఇస్తానని నమ్మించాడు. అధికారంలోకి రాగానే తన ఇంటిలోనే ఐదుగురికి ఉద్యోగాలు ఇచ్చాడని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ అన్నారు. ప్రజా గోస బీజేపీ భరోసా లో భాగంగా మంగళవారం రాత్రి హసన్‌పర్తి అంబేద్కర్ నగర్‌లో స్ట్రీట్ కార్నర్ సమావేశం జరిగింది. సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ నమ్మించి మోసం చేయడంలో కేసీఆర్ దిట్ట అన్నారు. కేసీఆర్ మాటలను ఇక ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. సమావేశంలో స్థానిక కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్, కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాంచంద్రారెడ్డి, బీజేపీ వరంగల్ పార్లమెంట్ కన్వీనర్ తాళ్లపల్లి కుమారస్వామి, డివిజన్ అధ్యక్షుడు మేకల హరిశంకర్, దళితమోర్చా రాష్ట్ర నాయకుడు తాళ్ల రమేష్, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్ల శ్యాం తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలపై సీఎం కేసీఆర్ నిర్లక్ష్యం

హన్మకొండ: కేంద్ర ప్రభుత్వ పథకాలపై సీఎం కేసీఆర్ నిర్లక్ష్యం వహిస్తున్నారని బీజేపీ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు అన్నారు. మంగళవారం హనుమకొండ ఎక్సైజ్ కాలనీలోని రైతు బజార్ వద్ద బీజేపీ ఆధ్వర్యంలో ప్రజాగోస–బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా కార్నర్ మీటింగ్ జరిగింది. శక్తి కేంద్రం ఇన్‌చార్జ్ మారపల్లి విష్ణువర్ధన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, 59వ డివిజన్ కార్పొరేటర్ గుజ్జుల వసంత, మహేందర్ రెడ్డి, సురేష్‌రెడ్డి, సత్యనారాయణ, రాజేంద్రప్రసాద్, రాంరెడ్డి, గోపాల్‌రెడ్డి, కిరణ్ పాల్గొన్నారు.

మాతృ భాషను మరువద్దు

హన్మకొండ: ఏ ప్రాంతానికి వెళ్లినా మాతృభాషను మరువద్దని విశ్రాంత ఉపాధ్యాయులు డాక్టర్ అకునూరి విద్యాదేవి అన్నారు. మంగళవారం హనుమకొండ వడ్డెపల్లిలోని పింగిళి ప్రభుత్వ మహిళ డిగ్రీ, పీజీ కళాశాలలో మాతృ భాష దినోత్సవాన్ని జరుపుకున్నారు. కార్యక్రమంలో విద్యాదేవి ప్రధాన వక్తగా పాల్గొని మాట్లాడుతూ మాతృభాషతో పాటు ఇతర భాషల్లోను పట్టు సాధించాలన్నారు. అయితే మాతృ భాషను నిర్లక్ష్యం చేయరాదన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రి న్సి పాల్ బత్తిని చంద్రమౌళి తెలుగు విభాగాధిపతి డా క్టర్ ఎం. శ్యామల, వైస్. ప్రిన్సిపల్ జి. సుహాసిని, అధికారులు పాల్గొన్నారు

ఖిలావరంగల్: వరంగల్ ఫోర్ట్ రోడ్డు విద్యానగర్ కాలనీలోని చాణిక్య విద్యానికేతన్ హైస్కూల్‌లో ప్రిన్స్‌పాల్ అచ్చ వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన తెలుగు భాష ఔన్నత్యాన్ని, విశిష్టతను విద్యార్థులకు వివరించారు. ప్రవీణ్‌కుమార్, రహమత్ సుమన్, శ్వేత, సంధ్య, ఇర్ఫాన్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

పేకాట స్థావరంపై పోలీసుల దాడులు

ఖిలావరంగల్ : వరంగల్ 36వ డివిజన్ చింతల్ ఆదర్శనగర్ కుంట ఏరియాలోని నిర్జీవ ప్రదేశంలో మంగళవారం సాయంత్రం పేకాట ఆడుతున్న వారిపై దాడి చేసి నిందితులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ ముస్క శ్రీనివాస్ తెలిపారు. పేకాట ఆడుతున్నట్లు పక్కా సమాచారం అందడంతో మంగళవారం సాయంత్రం పేకాట స్థావరంపై మిల్స్‌కాలనీ పోలీసులు అకస్మిక దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఎండీ.గౌస్, ఎండీ.రియాజ్, ఎండీ. మైహిమూద్, బూర సారంగపాణి, షేక్ అజీమ్, ఈగ చంద్రమౌళిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి ఆరు సెల్‌ఫోన్లు, రూ. 4640 నగదు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

వరంగల్: వరంగల్ వ్యవసాయ మార్కెట్ గేట్–2 పక్కనే ఉన్న షెడ్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం మంగళవారం లభించిందని ఎనుమాముల పీఎస్ ఎస్ఐ పి.శ్రీకాంత్ తెలిపారు. ఎత్తు 5.4, ఛామనచాయ, పసుపు చారాల రంగు షర్టు ధరించి ఉన్నట్లు తెలిపారు. వయస్సు 50 ఏళ్లు ఉంటుందని, ఎడమ ఛాతీపై పుట్టుమచ్చ ఉందన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామ ని, ఆచూకి తెలిస్తే సీఐ నెం.87126 85120, 871 26 85133, 081 నంబర్లలో సంప్రదించాలన్నారు.

వృద్ధుడు అదృశ్యం

ఖిలా వరంగల్: వరంగల్ శంభునిపేట ప్రాంతం బుడిగ జంగాల కాలనీ(ఎం.ఎం నగర్) చెందిన 70 ఏళ్ల వృద్ధుడు పత్తి కొమురయ్య అదృశ్యమైనట్లు ఇన్‌స్పెక్టర్ ముస్క శ్రీనివాస్ తెలిపారు. ఈనెల 6న కొమురయ్య పెన్షన్ డబ్బులు తెచ్చుకుంటానని ఇంట్లో చెప్పి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అప్పటి నుంచి బంధువులు, స్నేహితులు ఇళ్లల్లో వెతికారు. కొమురయ్య కుమారుడు పత్తి రాజీ ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యాదాఘాతంతో విద్యార్థినికి గాయాలు

కాజీపేట అర్బన్ : విద్యుత్ షాక్‌తో విద్యార్థినికి గాయాలైన సంఘటన హన్మకొండ హంటర్ రోడ్డులోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో రెండు రోజుల క్రితం చోటు చేసుకోగా మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పాఠశాల యాజమాన్యం తెలిపిన వివరాల ప్రకారం. పాఠశాలలోని గ్లీజర్ నుంచి వేడి నీళ్లు తీసుకునే క్రమంలో గ్లీజర్ ట్యాప్‌ను విద్యార్థిని తాకగా విద్యుత్‌షాక్ తగిలింది. విద్యార్థిని తల్లిదండ్రులు మంగళవారం పాఠశాలకు చేరుకుని పరామర్శించి, యాజమాన్యాన్ని వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థి సంఘాలు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

సంక్షిప్త సమాచారం

ట్యాక్స్‌లను సకాలంలో చెల్లించాలి

హసన్‌పర్తి : త్రైమాసిక ట్యాక్స్‌లను సకాలంలో చెల్లించాలని ఒకసారి వాహనం సీజ్ అయితే 200 శాతం పెనాల్టీ విధించడం జరుగుతుందని మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ కంచె వేణు అన్నారు. డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ పురుషోత్తం ఆదేశాల మేరకు మంగళవారం స్పెసల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పన్నులు చెల్లించని వాహనాలు సీజ్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వాహనాల యజమానులు ట్యాక్స్‌లను ఈ–సేవ కేంద్రాలు, ఆన్‌లైన్ ద్వారా చెల్లించాలని సూచించారు. వాహనాల స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్‌లు మహేందర్, శ్రీనివాస్, రవీందర్, వెంకన్న, రామకృష్ణా తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు కనీస వేతనం చెల్లించాలి

మడికొండ: పారిశ్రామిక వాడలో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని సీఐటీయూ హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు వేల్పుల సారంగపాణి డిమాండ్ చేశారు. మంగళవారం మడికొండ, రాంపూర్ ప్రాంతంలోని ఇండస్ట్రీయల్ ఏరియాలో కార్మి కుల స్థితిగతులపై సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కార్మిక చట్టాలను పారిశ్రామిక వాడలో అమలు చేయాలని అన్నారు.

కాంట్రాక్టు అధ్యాపకుల వేతనాలు పెంచాలి

కేయూ క్యాంపస్ : రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకుల వేతనాలను పెంచాలని ఎమ్మెల్సీ పల్లారాజేశ్వర్‌రెడ్డికి తెలంగాణా ఆల్ యూనివర్సిటీస్ కాంట్రాక్టు టీచర్స్ అసోసియేషన్ జనరల్‌సెక్రటరీ డాక్టర్ శ్రీధర్‌కుమార్‌లోథ్ ఇతర బాధ్యులు మంగళవారం కలిసి వినతిపత్రం సమర్పించారు. స్పందించిన రాజేశ్వర్‌రెడ్డి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు.

భూపతి కృష్ణమూర్తి జయంతి

రామన్నపేట : నగరంలోని ఆర్యవైశ్య మిత్రబృందం కార్యాలయంలో మిత్రబృందం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు దుబ్బ శ్రీనివాస్ అధ్యక్షతన స్వాతంత్ర సమరయోధుడు, తెలంగాణ ఉద్యమకారుడు భూపతి కృష్ణమూర్తి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కృష్ణమూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. భూపతి కృష్ణమూర్తి ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మిత్రబృందం ప్రధాన కార్యదర్శి గార్లపాటి నాగేంద్రబాబు, నాయకులు పాల్గొన్నారు.

రవికృష్ణను సన్మానించిన మంత్రి

హన్మకొండ: బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, హనుమకొండకు చెందిన బైరి రవికృష్ణ గౌడ్‌ను రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ సన్మానించారు. మంగళవారం హైదరాబాద్‌లో మంత్రిని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవి కృష్ణ గౌడ్, ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణు గోపాల్ గౌడ్ కలిశారు. బీసీ జన గణన చేయాలని, కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటుకు కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు.

పాతపెన్షన్ విధానం కొనసాగించాలి



ఎంజీఎం: తెలంగాణ రాష్ట్రంలో ఉద్యోగులకు సీపీఎస్ కాకుండా పాతపెన్షన్ విధానం కొనసాగేలా చర్యలు చేపట్టాలని సీపీఎస్ వైద్యవిభాగ అధ్యక్షుడు వెంకటస్వామి పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. సీపీఎస్ విధానంలో ఉద్యోగులకు నష్టాన్ని వివరించారు. ఉద్యోగులు పొందుతున్న పెన్షన్ వివరాలు, పాతన పెన్షన్ ఆవశక్యత గుర్చి స్పష్టంగా తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు శ్రీలత, దొడ్డిపాటి హరికుమార్, ఉద్యమ నాయకులు పాల్గొన్నారు.

అనధికార నిర్మాణాల కూల్చివేత

వరంగల్ అర్బన్ : బల్దియా పరిధిలోని మడికొండ శివారులోని రామన్ పాఠశాల ప్రాంతంలో 15 ఫీట్ల వ్యవసాయ నాలాను ఆక్రమించుకొని అనధికారంగా నిర్మించిన ప్రహరీని కూల్చివేశారు. మంగళవారం హన్మకొండ జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్, బల్దియా డీఆర్ఎఫ్ సిబ్బంది తొలగించారు. అనధికారికంగా స్థలాలను అక్రమించుకుని నిర్మాణాలు చేస్తే వాటిని తొలగించడంతో పాటు నిబంధనల మేరకు కఠిన చర్యలు తీసుకొని క్రిమినల్ కేసు నమోదు చేస్తామని సిటీ ప్లానర్ వెంకన్న తెలిపారు. టీఎస్ బీపాస్ ద్వారా అనుమతి పొందిన తర్వాత మంజూరు చేసిన ప్లాన్ (నక్షా) ప్రకారమే ఎలాంటి అతిక్రమణలు లేకుండా భవనాలు నిర్మించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ, పోలీస్, ఆర్‌అండ్‌బీ, ఇరిగేషన్, పంచాయతీరాజ్, బల్దియా అధికారులు, డీఆర్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

శంభునిగుడి హుండీ లెక్కింపు

ఖిలా వరంగల్: ఖిలావరంగల్ మధ్యకోటలోని స్వయంభూ శ్రీశంభులింగేశ్వరస్వామి దేవాలయంలో శివరాత్రి మహోత్సవానికి ఏర్పాటు చేసిన హుండీలను మంగళవారం ఆలయ ప్రాంగణంలో లెక్కించారు. దేవాదాయశాఖ ఈఓ ఎస్.వెంకట్రావు ఆధ్వర్యంలో కార్పొరేటర్లు వేల్పుకొండ సువర్ణ, బైరబోయిన ఉమ పర్యవేక్షణలో లెక్కింపు నిర్వహించారు. 6 హుండీలు, ఆర్చన, అభిషేకాల, దర్శనాలు మొత్తం రూ.2.12.773ల ఆదాయం వచ్చిందని వెంకట్రావు తెలిపారు.

సిరిపురం యాదయ్యకు నివాళి

హన్మకొండ: ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు మలిదశ ఉద్యమ అమరవీరుడు సిరిపురం యాదయ్యకు తెలంగాణ పద్మశాలి యువజన సంఘం, జాతీయ చేనేత ఐక్య వేదిక నాయకులు నివాళులర్పించారు. మంగళవారం హనుమకొండలోని తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద యాదయ్య 13వ వర్ధంతిని జరుపుకున్నారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు.


రేవంత్ రెడ్డివి పచ్చి అబద్ధాలు

హన్మకొండ : బీఆర్ఎస్ ప్రభుత్వం, చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్‌పై చేస్తున్న ఆరోపణలన్నీ అవాస్తవాలని బీఆర్ఎస్ యువత రాష్ట్ర నాయకుడు బొల్లికొండ వీరేందర్ అన్నారు. మంగళవారం హనుమకొండ నయీంనగర్‌లోని బీఆర్ఎస్ డివిజన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

షర్మిల ఫ్లెక్సీ దహనం

వరంగల్ చౌరస్తా : హిజ్రాలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన తెలంగాణ వైఎస్ఆర్ టీపీ అధ్యక్షురాలు షర్మిల ఫ్లెక్సీని దహనం చేశారు. మంగళవారం హెడ్‌పోస్టాఫీస్ సెంటర్‌లో షర్మిల వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని హిజ్రాల సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు.

విద్యాకమిషనర్‌ను కలిసిన కళాశాల ప్రిన్సిపాల్



విద్యారణ్యపురి: కేడీసీకి న్యాక్ 'ఏ' ప్లస్ గ్రేడ్ లభించటంతో ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రాజారెడ్డి, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ బి.రమేష్, అధ్యాపకులు హైదరాబాద్‌లో కళాశాల విద్యాకమిషనర్ నవీన్‌మిట్టల్‌ను మార్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా నవీన్‌మిట్టల్ మాట్లాడుతూ రాష్ట్రంలో కేడీసీ న్యాక్ ఏ ప్లస్ గ్రేడ్ కళాశాలగా గుర్తింపు పొందిన రెండో కళాశాలగా ఉందన్నారు. త్వరలోనే కళాశాల స్వయం ప్రతిపత్తి కోసం ప్రిన్సిపాల్, అధ్యాపకులు కృషిచేయాలని సూచించారు. కళాశాలకు న్యాక్ ఎప్లస్ గ్రేడ్ సాధించినందుకు ప్రిన్సిపాల్‌ను, అధ్యాపకులను ఆయన అభినందించారు.

'కంటి వెలుగు' ప్రారంభం

కాజీపేట: కాజీపేట 61వ డివిజన్ సిద్దార్థనగర్ కాలనీలోని ప్రభుత్వ కమ్యూనిటీ హాల్‌లో మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కంటి వెలుగు పరీక్ష కేంద్రాన్ని కార్పొరేటర్ ఎలకంటి రాములు ప్రారంభించారు. శిబిరంలో డివిజన్ ప్రజలతో కలిసి క్యూ లైన్‌లో నిలబడి కంటి పరీక్షలు చేయించుకుని అద్దాలను వైద్యుల చేతుల మీదుగా అందుకున్నారు. కార్యక్రమంలో కుమ్మరి కోటిలింగం, కోరబోయిన శ్రావణ్‌కుమార్, మహేందర్, నరసయ్య, పుల్లయ్య, వెంకటస్వామి, సోమేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

నయీంనగర్ : గ్రేటర్ వరంగల్ 53వ డివిజన్ లష్కర్ సింగారం బేతల్ బాప్టిస్ట్ చర్చి ఆవరణలో మంగళవారం కంటి వెలుగు శిబిరాన్ని చర్చి సంఘం పెద్దల ఆధ్వర్యంలో 53వ డివిజన్ కార్పొరేటర్ సోదా కిరణ్ ప్రారంభించారు. కార్యక్రమంలో డివిజన్ బీఆర్ఎస్ కార్యకర్తలు, వైద్య సిబ్బంది, పాల్గొన్నారు.